క్లుప్తంగా

అక్రమ మట్టిరవాణాపై చర్యలు

- ఎంపీడీఓ యాదగిరిరెడ్డి



అధికారులతో చర్చిస్తున్న ఎంపీడీఓ

మనోహరాబాద్(తూప్రాన్): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మనోహరాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో పలుశాఖల అధికారులతో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, ఎంపీఓ సతీశ్, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి అక్రమ మట్టి రవాణాపై చర్చించారు. కొండాపూర్, కూచారం, మనోహరాబాద్, లింగారెడ్డిపేట్ తదితర గ్రామాలలో ప్రభుత్వ భూములు, కుంట శిఖాల నుంచి ఏలాంటి అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని, దానిపై చర్చించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఎంపీ టికెట్ మదన్‌రెడ్డికి ఇవ్వాలి

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్ఎస్ మెదక్ ఎంపీ టికెట్ నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి కేటాయించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వంజరి కొండల్ కోరారు. పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలిసి గురువారం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాలతో మదన్‌రెడ్డి నర్సాపూర్ సిట్టింగ్ స్థానాన్ని వదులుకున్న విషయం గుర్తుచేశారు. మదన్‌రెడ్డి సేవలను గుర్తించి అధిష్ఠానం టికెట్ ఇవ్వాలన్నారు.

టీఎన్జీఓ నూతన కార్యవర్గం

అల్లాదుర్గం(మెదక్): ఐసీడీఎస్ పరిధిలోని రేగోడ్, పెద్దశంకరంపేట, టేక్మాల్, అల్లాదుర్గం మండల టీఎన్జీఓ యూనిట్ నూతన కార్యవర్గాన్ని గురువారం మెదక్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీఎన్జీఓ యూనిట్ అధ్యక్షుడుగా ధర్మచందర్(రేగోడ్), కార్యదర్శిగా సందీప్(అల్లాదుర్గం), ఉపాధ్యక్షుడుగా అంజయ్య, కోశాధికారిగా వినీత్ ఎన్నికయ్యారు.

'రైతుబంధు'ను విడుదల చేయాలి

- రైతు సమన్వయ సమితి నేత



మాట్లాడుతున్న రైతు నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): యాసంగి పంట పెట్టుబడి కోసం ప్రభుత్వం ఇచ్చే రైతుబంధు డబ్బులను ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాలో జమచేయాలని రైతు సమన్వయ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్యయాదవ్ డిమాండ్ చేశారు. వెల్దుర్తిలో గురువారం ఆయన మాట్లాడుతూ.. రైతుబంధు సాయం అందకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఆయన వెంట రైతు సంఘం మండల నాయకుడు వెంకటేశం పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి అభినందనలు

చిన్నశంకరంపేట(మెదక్): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియామకమైన గడ్డం శ్రీనివాస్‌ను చిన్నశంకరంపేట, నార్సింగి మండల బీజేపీ నాయకులు గురువారం అభినందించారు. పార్టీ కార్యాలయంలో గడ్డం శ్రీనివాస్‌తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా నియామకమైన రంజిత్‌మోహన్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి, నార్సింగి మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, దుబ్బాక అసెంబ్లీ కో కన్వీనర్ గోవింద్ ఉన్నారు.

రోడ్డును తొలగించిన ఇరిగేషన్ అధికారులు



అధికారులు తవ్వేసిన రోడ్డు

తూప్రాన్: పట్టణంలోని పోతరాజుపల్లి గ్రామ సమీపంలోని కొత్త చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన రోడ్డును కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకు గురువారం ఇరిగేషన్ అధికారులు తొలగించారు. గీతా కళాశాల యాజమాన్యం కొత్త చెరువు(ఎఫ్‌టీఎల్) నీటి ముంపు ప్రాంతం నుంచి అక్రమంగా రోడ్డును నిర్మించారు. గురువారం మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఇరిగేషన్ అధికారులతో అక్రమ రోడ్డు నిర్మాణంపై ఆరా తీశారు. ఇదంతా గత బీఆర్ఎస్ పార్టీ అండదండలతోనే జరిగిందని వారు ఆరోపించారు. వెంటనే రోడ్డును తొలగించాలని అధికారులకు సూచించారు. అయితే తాము గతంలోనే నోటీసులు జారీ చేశామని, గురువారం రోడ్డును యంత్రాలతో తవ్వించినట్లు ఇరిగేషన్ డీప్యూటీ డీఈఓ శ్రీకాంత్ తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కే ప్రధానం

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కే ప్రధానమని తహసీల్దార్ ముసాద్దిక్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు ఓటు వినియోగంపై గురువారం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఓటే ప్రధాన ఆయుధమని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రలోభాలకులోనై ఓటును దుర్వినియోగం చేసుకోకూడదని హితవుపలికారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

మనోహరాబాద్(తూప్రాన్): ప్రతి ఒక్కరు ఓటుహక్కును విధిగా వినియోగించుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. 95 సంవత్సరాల వృద్ధుడిని సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కౌశిక, ఆర్ఐ దీక్షిత్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

పలు గ్రామాల్లో ర్యాలీలు..

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎంపీడీఓ భారతి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం తూప్రాన్- నర్సాపూర్ హైవేపై మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్స్‌పాల్ వెంకటసుబ్బయ్య, ఆర్ఐ కిషన్, ఎంపీఓ తిరుపతిరెడ్డి, హెచ్ఎం బాలచంద్ర, వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

చిన్నశంకరంపేటలో.. తహసీల్దార్ కార్యాలయ అధికారులు, విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్‌స్టాండ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, ఆర్ఐ చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటులోనే దేశ భవిత..

పాపన్నపేట(మెదక్): ఓటుహక్కు వినియోగంతో దేశ భవితను నిర్ణయించవచ్చని తహసీల్దార్ లక్ష్మణ్ బాబు అన్నారు. గురువారం పాపన్నపేటలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్ నర్సింలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, నేతల ప్రతిజ్ఞ..

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని వెల్దుర్తి, మాసాయిపేటలో రెవెన్యూ కార్యాలయ ఉద్యోగులు, నేతలు, జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్, హనుమాన్ చౌరస్తా మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్ఞానజ్యోతి, గిర్దావర్ ధన్‌సింగ్, జయభారత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో.. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం అవరణలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీశ్, ఎంపీడీఓ శంకర్, ఆర్ఐ వరలక్ష్మి, రెవెన్యూ, ఎంపీపీ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో.. తహసీల్దార్ గ్రేస్‌బాయి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వెంకటేశం, ఆర్ఐ శరణప్ప, ఉపా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

> **మానవహారం...**
>
> కౌడిపల్లి(నర్సాపూర్): జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అర్హులందరూ ఓటుహక్కును కలిగి ఉండాలని తహసీల్దార్ ఆంజనేయులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీజేసీ లెక్చరర్లు, రెవెన్యూ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కౌడిపల్లిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, లెక్చరర్లు, అధికారులు



మనోహరాబాద్‌లో వృద్ధుని సన్మానిస్తున్న తహసీల్దార్



చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్, కార్యదర్శి తదితరులు



శివ్వంపేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న తహసీల్దార్



చిన్నశంకరంపేటలో..



పాపన్నపేటలో చైతన్య ర్యాలీ



వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటలో..



పెద్దశంకరంపేటలో..

భారతీయుల కల సాకారం

- సంగ్రామ్ మహారాజ్

పెద్దశంకరంపేట(మెదక్): అయోధ్యలో రామాలయం నిర్మాణంతో భారతీయుల కల నెరవేరిందని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి, అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రామ్ మహరాజ్ అన్నారు. గురువారం ఆయన అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వచ్చారు. ఆయన మాట్లాడుతూ ధర్మపరిరక్షణకు ప్రతీ ఒక్కరూ పాటు పడాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దత్తు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి అనుమతివ్వాలని వినతి

నర్సాపూర్ రూరల్: మండలంలోని రుస్తుంపేటలో నూతనంగా నిర్మిస్తున్న గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల నుంచి ఎల్లారెడ్డిగూడ తండా వరకు రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు సర్పంచ్‌లు విజయభాస్కర్ రాజు, సంతోష బిక్కు వినతి పత్రం అందజేశారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

- ఇన్‌చార్జి ఆర్టీఓ



అవగాహన కల్పిస్తున్న రిచర్డ్స్

చేగుంట(తూప్రాన్): మద్యసేవించి వాహనాలు నడపరాదని ఇన్‌చార్జి ఆర్టీఓ రిచర్డ్స్ పిలుపునిచ్చారు. గాంధీ చౌరస్తా వద్ద గురువారం జాతీయ రోడ్డుభద్రత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే ఇతరుల ప్రాణాలకే ముప్పు కలుగుతుందన్నారు. డ్రైవర్లు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విద్యార్థుల మాక్‌పోలింగ్

శివ్వంపేట(నర్సాపూర్): స్థానిక ఉన్నత పాఠశాలలో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటుహక్కుపై ప్రతి విద్యార్థికి అవగాహన కలిగించడానికి మాక్ పోలింగ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎంఈఓ బుచ్చనాయక్ అన్నారు. ఆయన పోలింగ్ సరళిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. 6 నుంచి 10వ తరగతికి చెందిన 350 మంది విద్యార్థులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. పదో తరగతి విద్యార్థులు మేఘన, సన్ని, మోహన్‌లాల్ పోటీలో ఉండగా 27 ఓట్ల తేడాతో మేఘన విజయం సాధించింది. ఎన్నికల అధికారిగా జగదీశ్వర్ వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాక్ పోలింగ్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆ పోలీసులను సస్పెండ్ చేయాలి

బీసీ సంఘం జిల్లా అధ్యక్షురాలు అశ్విని



మాట్లాడుతున్న అశ్విని

రామాయంపేట(మెదక్): అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను ఇతర సంస్థలకు కేటాయించడాన్ని నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినిపై పాశవికంగా ప్రవర్తించిన పోలీసులను సస్పెండ్ చేయాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షురాలు పోచమ్మల అశ్విని డిమాండ్ చేశారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని జుట్టు పట్టుకొని ఈడ్చు కెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పోలీసులపై హత్యాయత్నం కింద కేసులు నమోదుచేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

కౌడిపల్లి(నర్సాపూర్): గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలలో విద్యార్థులకు క్రీడాపోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. కౌడిపల్లి, వెల్మకన్న, భుజిరంపేట, కౌడిపల్లి బాలికల పాఠశాలతో పాటు పలు గ్రామాలలో పీడీలు రమేశ్, రాజేందర్, మహిపాల్, ఉపాధ్యాయులు ఆయా పాఠశాలలో బాల బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు.



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

మున్సిపల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు

నర్సాపూర్ రూరల్: రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాలకృష్ణ ఇటీవల హైదరాబాదులో జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం మున్సిపల్ కార్యాలయంలో కార్యాలయ మేనేజర్ మధుసూదన్, సిబ్బంది ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

టీపీఎస్ఎఫ్ నూతన కార్యవర్గం



రాకేశ్‌ను సన్మానిస్తున్న కార్యదర్శులు

టేక్మాల్(మెదక్): మండల నూతన పంచాయతీ సెక్రెటరీ ఫెడరేషన్ కార్యవర్గాన్ని గురువారం ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా జగదీశ్, ప్రధాన కార్యదర్శిగా రవితేజ, కోశాధికారిగా రాజ్ కుమార్, మహిళా అధ్యక్షురాలుగా అనితను ఎన్నుకున్నారు. జిల్లా పంచాయతీ సెక్రెటరీ ఫెడరేషన్ కోశాధికారిగా ఎన్నికైన బి.రాకేశ్ కుమార్‌ను కార్యదర్శులంతా సన్మానించారు.

హెచ్ఆర్సీ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా అసద్ ఖాన్

టేక్మాల్(మెదక్): మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా టేక్మాల్‌కు చెందిన మహ్మద్ అసద్‌ఖాన్ ఖాద్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన తనకు అవకాశం కల్పించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

జెడ్పీటీసీ సేవలు భేష్



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట జెడ్పీటీసీ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం ఆమె మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా సొంత నిధులు రూ.1.80లక్షలతో మల్లుపల్లిలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జెడ్పీటీసీ గ్రామాల్లో తాగు నీటి ఇబ్బందులు తొలగించేందుకు కృషిచేయడం, బోరుబావులు తవ్వించడం, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారికి ఆర్థికసాయం చేయడం చాలాగొప్ప విషయమన్నారు. సర్పంచ్ భాగ్యమ్మ, ఎంపీటీసీ లక్ష్మి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, వైస్ ఎంపీపీ రామాకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భ్రమరాంబిక మల్లికార్జునస్వామికి పూజలు

నర్సాపూర్ రూరల్: గొల్లపల్లిలోని భ్రమరాంబికా మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాల్లో గురువారం ఎమ్మెల్యే సుతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు మలేశ్‌గౌడ్ వారిని శాలువాలతో సన్మానించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ

మెదక్ కలెక్టరేట్: ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కడారి నర్సమ్మ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రవాణారంగంలో సుమారు 25 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. మహాలక్ష్మి పథకంవల్ల ఆటో కార్మికులు రోడ్డున పడ్డారని, రవాణా కార్మికుల కోసం సంక్షేమబోర్డు ఏర్పాటుచేసి, రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రశాంత్, బబ్లూ, బాబు, సంతోష్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నర్సమ్మ

సంక్షిప్త వార్తలు

◆ గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

శివ్వంపేట(నర్సాపూర్): 75వ గణతంత్ర వేడుకలకు పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. విద్యార్థులు పాఠశాలల్లో రంగురంగుల ముగ్గులు వేసి అందంగా తీర్చిదిద్దారు. పంచాయతీ కార్యాలయాలను అధికారులు సిద్ధం చేశారు.

◆ నేటి నుంచి ఉర్సు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గంగాయిపల్లిలో శుక్రవారం నుంచి ఘనంగా ఉర్సు ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకుడు నర్సింలు చిష్తి తెలిపారు. ఓం ఫాజిల్ నగర్ అప్పగారి ఆశ్రమ 42వ సంవత్సర ఆరాధన ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

◆ రైల్వేస్టేషన్ వద్ద బైక్ చోరీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లి రైల్వేస్టేషన్ వద్ద పార్క్‌చేసిన బైక్ చోరీకి గురైంది. నార్సింగి మండల కేంద్రానికి చెందిన లక్ష్మీ నారాయణ తన బైక్‌ను మిర్జాపల్లి రైల్వేస్టేషన్ ఎదుట బుధవారం పార్క్‌చేశాడు. సాయంత్రం వచ్చి చూడగా బైక్ కన్పించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

◆ ఎమ్మెల్యే రోహిత్‌రావుకు సన్మానం

రామాయంపేట(మెదక్): ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావును మండలంలోని ఆర్ వెంకటాపూర్ గ్రామానికి చెందిన సంఘ సేవకుడు వెంకుగారి రాజిరెడ్డి సన్మానించారు. గురువారం ఆయన ఎమ్మెల్యేను కలిసి గ్రామాభివృద్ధిపై చర్చించారు. తనవంతు సహకారం అందజేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని రాజిరెడ్డి తెలిపారు.

◆ వాగులో మృతదేహం లభ్యం

తూప్రాన్: కిష్టాపూర్ హల్దీవాగులో మృతదేహం లభ్యమైంది. గ్రామానికి చెందిన పిట్ల వెంకటయ్య(50) బుధవారం తన పొలానికని ఇంటి నుంచి వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతకగా వెంకటయ్య వస్త్రాలు వాగుగట్టుపై ఉండడంతో వాగులో గాలించినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో గురువారం ఉదయం ఆయన మృతదేహం వాగులో లభ్యమైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

◆ ఖర్గే సమావేశానికి తరలివెళ్లిన నాయకులు

టేక్మాల్(మెదక్): హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్వహించిన బీఎల్ఏల సమావేశానికి గురువారం మండల నాయకులు తరలివెళ్లారు. వారిలో మండల అధ్యక్షుడు నిమ్మ రమేశ్, మల్లారెడ్డి, సత్యనారాయణ, కిషోర్, లక్ష్మణ్, నాగయ్య తదితరులు ఉన్నారు.

నిరాశ నింపిన పునర్విభజన



ఏపీజీవీబీ బ్యాంకు వద్ద వేచిఉన్న ఖాతాదారులు

> **కలగా మిగిలిన ఎస్‌బీఐ**
>
> - ఏపీజీవీబీలో నిత్యం రద్దీ
> - ప్రజలు, అధికారుల అవస్థలు

రేగోడ్(మెదక్): జిల్లాలు, మండలాల పునర్విభజనతో మేలు కలుగుతుందని అనుకున్న ప్రజలకు నిరాశే మిగిలింది. మండల కేంద్రమైన రేగోడ్ ఉమ్మడి మండలంలో 19 పంచాయతీలు ఉండేవి. రేగోడ్‌లో ఏపీజీవీబీ బ్యాంకు, దేవునూర్‌లో ఎస్‌బీఐ బ్యాంకులు ఉండేవి. మండలాల పునర్విభజనలో దేవునూర్ పంచాయతీతో పాటు ఎస్‌బీఐ వట్‌పల్లి మండలంలోకి వెళ్లింది. దీంతో మండలంలో పాత వాటితో కలిపి తిరిగి 18 పంచాయతీలు ఏర్పడ్డాయి. ఇక రేగోడ్‌కు ఏపీజీవీబీ బ్యాంకు ఒకటే మిగిలింది. దీంతో వ్యాపారులు, ఫించన్ లబ్ధిదారులు, ఈజీఎస్ కూలీలతో బ్యాంకు నిత్యం రద్దీగా ఉంటోంది. ఉద్యోగులతో పాటు ఖాతాదారులు చాలాఅవస్థలు పడుతున్నారు. విసుగుచెందిన ఖాతాదారులు, ఉద్యోగుల మధ్య గొడవలు నిత్యంకృత్యం అయ్యాయి. మండలంలో పనిచేసే ఉపాధ్యాయులు, ఆయా శాఖల ఉద్యోగుల ఖాతాలు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని బ్యాంకుల్లో ఉంచారు. బ్యాంకు లావాదేవీల కోసం ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. రేగోడ్‌లో ఏపీజీవీబీ ఒక్కటే ఉండడంతో బ్యాంకు ఎప్పుడూ జనంతో కిక్కిరిసి ఉంటోంది. రేగోడ్‌లో ఎస్‌బీఐ బ్యాంకుతో పాటు ఏటీఎం కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకొనే నాథుడు కరువయ్యాడని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేగోడ్‌లో ఎస్‌బీఐతో పాటు ఏటీఎం కౌంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.